క్లుప్తంగా

ఘనంగా గుడ్ గవర్నెన్స్ డే



సభలో మాట్లాడుతున్న స్వామి వివేకానంద సేవా సమితి ప్రతినిధి వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: స్థానిక ఏఎస్ఎన్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గుడ్ గవర్నెన్స్ డే మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్వామి వివేకానంద సేవా సమితి ప్రతినిధి గనిశెట్టి వెంకటేశ్వరరావు అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదినమైన డిసెంబర్ 25న సుపరిపాలన దినంగా ప్రకటించడం ఆయన చేసిన సేవలకు తార్కాణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ వీహెచ్ కిషోర్‌కుమార్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అన్నాజీరావు, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు ఫణీంద్ర, ఈశ్వర్, సరోజిని పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ



కిరణ్‌కుమార్‌ను అభినందిస్తున్న జిమ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో ఇటీవల జరిగిన తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో అమలాపురం జీకే ఫిట్నెస్ జిమ్ పవర్ లిఫ్టర్ చీకురుమిల్లి కిరణ్‌కుమార్ 74 కేజీల విభాగంలో ప్రథమ స్థానం సాధించాడు. బ్రెంచ్ ప్రెస్ విభాగంలో సైతం ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. ఈ రెండు విభాగాల్లో కిరణ్‌కుమార్ ప్రథమ స్థానాలు సాధించి రెండు బంగారు పతకాలను కైవసం చేసుకున్నాడు. స్థానిక నల్ల వంతెన వద్ద గల ఈకే ఫిట్నెస్ జిమ్‌లో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో విజేత కిరణ్‌కుమార్‌ను జిమ్ ప్రతినిధి డి.గోపికృష్ణ ప్రశంసించారు.

ఇసుక లారీ సీజ్



ఎస్.యానంలో ఇసుక లారీని అదుపులోకి తీసుకున్న సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాన్ని ఆర్ఐ లలిత మంగళవారం సీజ్ చేశారు. ఇసుక తరలిస్తున్న ఒక లారీతో పాటు తవ్వకాలు చేస్తున్న పొక్లెయినర్‌ను పోలీసుల సహకారంతో ఆర్ఐ అదుపులోకి తీసుకున్నారు. ఇసుక లోడుతో ఉన్న లారీను రెవెన్యూ సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సేంద్రియ సేద్యం.. ఆరోగ్యదాయకం

- సాగుకు అన్నదాతల ఆసక్తి
- డివిజన్ పరిధిలో 18 దత్తత గ్రామాల ఎంపిక
- ఉద్యాన, కూరగాయల పంటలతో రైతుకు ఆదాయం
- వినియోగదారుల ఆరోగ్యం భద్రం



సేంద్రియ విధానంలో అంతర పంటలు పండిస్తున్న రైతులు

ముమ్మిడివరం: రసాయనిక ఎరువులతో సాగు చేసిన ఆహార ఉత్పత్తులు విషతుల్యంగా మారుతున్నాయి. దీంతో సేంద్రియ విధానంలో సాగు చేసిన ఆహార ఉత్పత్తులపై ప్రజలు మక్కువ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి పంట సాగును రైతులు ఇష్ట పడుతున్నారు. వీరికి రైతు సాధికారిక సంస్థ చేయూతనిస్తోంది. ఈ సంస్థ ఆధ్వర్యంలో ముమ్మిడివరం డివిజన్ పరిధిలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో 18 గ్రామాలను దత్తత తీసుకొని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. 40 శాతం సబ్సిడీపై కూరగాయలు, వాణిజ్య పంటలకు సంబంధించి విత్తనాలు అందిస్తూ సాగు విధానంలో తగు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. దత్తత గ్రామాలలో సేంద్రియ విధానంలో సహజ సిద్ధమైన పంటలను పండిస్తున్నారు. వరి, ఉద్యాన పంటలు, కూరగాయలు, ఆకు కూరలు సాగు చేసి రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. కొన్ని గ్రామాలలో పెరట్లో కూరగాయల సాగుకు ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రోత్సహిస్తోంది.

ఏ గ్రేడు పద్ధతిలో వరిచేల గట్లపై కాయగూరలు, వాణిజ్య పంటలు పండిస్తున్నారు. ఏటీఎం గ్రేడు పద్ధతిలో 20 సెంట్ల స్థలంలో 18 నుంచి 31 రకాల కూరగాయలు, వాణిజ్య పంటలు పండిస్తున్నారు. సేంద్రియ విధానంలో సాగు చేసిన కూరగాయల విత్తనాలు సేకరించి వంగ, బెండ, టమాటా, మిరప, కాకర, ఆనప, బీర, గోరు చిక్కుడు, తోటకూర, మెంతు కూర, పాలకూర, గోంగూర, బచ్చలి, సాగు చేసి ఆరోగ్యకరమైన పంటలు పండిస్తున్నారు.



జీవామృతం తాయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జీవామృతమే ఎరువు

దేశవాళీ ఆవు నుంచి సేకరించిన పేడ, మూత్రం, బెల్లం, శెనగపిండి, పుట్టమన్ను, నీరు వినియోగించి తయారు చేసిన జీవామృతాన్ని పెరట్లో సాగు చేస్తున్న ఆకు కూరలు, కాయ గూరలకు ఎరువుగా వినియోగిస్తున్నారు.



పెరట్లో ప్రకృతి పంట సాగు

తెగుళ్ల నివారణ ఇలా..

రసం పీల్చే పురుగులు, ఇతర చిన్న పురుగుల నివారణకు నీమాస్త్రం పిచికారీ చేస్తున్నారు. ఆవు పేడ, ఆవు మూత్రం, వేపాకు రసంతో నీమాస్త్రం తయారు చేసుకొని తెగుళ్లను నివారిస్తున్నారు.

పెట్టుబడిలేని ఎరువు



నేను వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాను. నాకున్న ఒక ఎకరం పొలంలో సేంద్రియ పద్ధతిలో వరిసాగు చేస్తున్నాను. రెండెకరాల కొబ్బరి తోటలో సేంద్రియ పద్ధతిలో అంతర పంటలు సాగు చేస్తున్నాను. ఆవుపేడ, మూత్రం, శెనగ పిండి, బెల్లం, పుట్టమన్ను కలిపి జీవామృతం తయారు చేసుకొని కాయగూరల పంటలకు ఎరువుగా వాడుతున్నాను. మొక్కలు ఏపుగా పెరిగి దిగుబడి బాగా వస్తోంది.

కంచర్ల వెంకట్రావు, రైతు, కొత్తలంక.

ప్రకృతి పంటలకు ప్రోత్సాహం



సేంద్రియ సాగు విధానంతో ప్రకృతి పంటలను ప్రోత్సహిస్తున్నాం. 40 శాతం సబ్సిడీపై అన్ని రకాల వాణిజ్య, కూరగాయల పంటలకు సంబంధించి విత్తనాలు సరఫరా చేస్తున్నాం. డివిజన్‌లో 18 గ్రామాలను దత్తత తీసుకొని ఆయా గ్రామాలలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడమే కాక సేంద్రియ ఎరువుల తయారీ, సాగు విధానంలో సూచనలు, సలహాలు ఇస్తున్నాం. సుమారు 256 మంది రైతులు ఈ పంటలపై ఆసక్తి చూపుతున్నారు.

ఆవనిగడ్డ ఏడుకొండలు,
మాష్టర్ ట్రైనీ, రైతు సాధికారిక సంస్థ.

భూ సమస్యలను పరిష్కరించాలి



విలసవిల్లి సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: గ్రామంలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేలా చూడాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అధికారులకు సూచించారు. మండలంలోని విలసవిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ వీఎస్.దివాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో ప్రభుత్వ భూమిని సర్వే ద్వారా వెలికి తీయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఆర్ఐ జి.లలిత, ఈవో కార్తీక, వీఆర్వో వెంకటరమణ, సర్వేయర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలకు ఏర్పాట్లు

యానాం: పర్యాటకశాఖ ఆధ్వర్యంలో స్థానిక సీగల్స్ రెస్టారెంట్‌లో న్యూ ఇయర్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, వివిధ రకాల వంటకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దీనికి ఎంట్రీ ఫీజు ఉంటుందని చెప్పారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఈ వేడుకల్లో పాలొని ఆనందించాలని కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

తాళ్లరేవు: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ రాయుడు సునీత తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తాళ్లరేవు, పటవల గ్రామ పంచాయతీలలో రూ.17 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టనున్న సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. పటవల పంచాయతీ శాంతి మూల నుంచి తణుకువాడ వరకు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రావెల్ రహదారికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ.4 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ, తాళ్లరేవు జెల్లావారిపేటలో రూ.6.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారి, పెంకేవారిపేటలో రూ.2 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారులకు ఎంపీపీ శంకుస్థాపన చేశారు. పటవల సర్పంచ్ చినకామేశ్వరరావు, తాళ్లరేవు మాజీ సర్పంచ్ రెడ్డి రెడ్డిబాబు, ఎంపీటీసీ సభ్యులు నందికోళ్ల శ్రీదేవి, పటవల పంచాయతీ కార్యదర్శి ఏవీ రామరాజు, నాయకులు పాల్గొన్నారు.

కోఫెడ్ కోఆర్డినేటర్ సత్యనారాయణకు సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి, అధికారులు

అమలాపురం టౌన్: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కోనసీమ కన్జుమర్స్ ఫెడరేషన్ (కోకో ఫెడ్) కో ఆర్డినేటర్ బీవీవీ సత్యనారాయణకు స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం సన్మానం జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ఉదయ భాస్కర్ చేతుల మీదుగా సత్యనారాయణ ఈ సత్కారాన్ని అందుకున్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కోకో ఫెడ్ చేస్తున్న కృషిని జాయింట్ కలెక్టర్ నిషాంతి అభినందించారు. డీఈవో షేక్ సలీమ్ బాషా, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర, మెట్రాలిజీ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎంఈవోలు, విద్యార్థుల సమక్షంలో ఈ సత్కారం జరిగింది.

పోప్ జాన్‌పాల్ నాణెం సేకరణ

అమలాపురం టౌన్: కాంగో డెమోక్రటిక్ రిపబ్లిక్ దేశం పోప్ జాన్‌పాల్-2 జ్ఞాపకార్థం విడుదల చేసిన 25 ఫ్రాంకుల అరుదైన నాణేన్ని అమలాపురానికి చెందిన నాణేల సేకరణ కర్త ఆ దేశం నుంచి ప్రత్యేకంగా రప్పించారు. ఈ నాణేన్ని యాక్రిలిక్ పదార్థంతో తయారు చేయడం వల్ల పారదర్శకంగా ఉంటుంది. 140 మిల్లీ మీటర్ల వ్యాసం కలిగిన ఈ నాణెం బరువు అక్షరాల ఒక కేజీ. ప్రపంచ వ్యాప్తంగా కేవలం 401 నాణేలను మాత్రమే ముద్రించడంతో ఇది అరుదైనదని సేకరణ కర్త కృష్ణ కామేశ్వర్ పేర్కొన్నారు. ఈ నాణెంపై పోప్ జీవిత కాలాన్ని ముద్రించారని తెలిపారు.



పోప్ జాన్‌పాల్ పేరుతో విడుదలైన నాణెం

సమస్యల పరిష్కారానికి కృషి

యానాం: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మంగళవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి చీఫ్ టౌన్‌ప్లానర్, లా సెక్రటరీతో ఇప్పటికే చర్చించినట్లు తెలిపారు. ఫ్రాన్సితిప్పకు సంబంధించి సమస్యపై ఇప్పటికే సీఎం రంగసామి ఇచ్చిన ఇన్‌స్ట్రక్షన్ ఫైలును గురువారం నాటికి రాజ్‌నివాస్‌కు చేరుతుందన్నారు. విద్యాశాఖలో పనిచేస్తున్న మిల్క్ బాయిలర్స్‌కు రూ.10వేల నుంచి రూ.18 వేలకు వేతనాలు పెంచేందుకు సంబంధించిన ఫైలును క్లియర్ చేసి ఆర్థికశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపిందన్నారు.

28న ఓఎన్‌జీసీ పరిహారం పంపిణీ

తాళ్లరేవు: ఓఎన్‌జీసీ సంస్థ ద్వారా మత్స్యకారులకు అందించే నష్ట పరిహారాన్ని ఈ నెల 28వ తేదీ శనివారం లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. మంగళవారం కోరంగి పంచాయతీలో మత్స్యకారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లాలో ఓఎన్‌జీసీ కార్యకలాపాల కారణంగా నష్టపోయిన 23,458 మంది లబ్ధిదారులకు ఐదు నెలల పదిహేను రోజులకు సంబంధించి ఒక్కొక్కరికీ రూ.63,250 చొప్పున అందజేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

యానాం: నియోజకవర్గంలో అన్ని వర్గాలకు ఓఎన్‌జీసీ నష్ట పరిహారం అందేలా ఐక్యపోరాటం చేయనున్నట్లు ఎంపీ వైథిలింగం తెలిపారు. మంగళవారం పుదుచ్చేరిలో స్థానిక కాంగ్రెస్ నేతలు ములగపాటి ప్రసాద్‌రాజు ఆధ్వర్యంలో ఎంపీ వైథిలింగంను కలిసి పరిహారం కోసం పోరాటానికి అనుసరించాల్సిన విధానంపై చర్చించారు. నియోజకవర్గ పరిధిలో చమురు సంస్థల నుంచి వస్తున్న వందలాది కోట్ల రూపాయిల సీఎస్ఆర్ నష్ట పరిహారం ఒక వర్గానికి తప్ప మిగిలిన వారికి అందటం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

వైద్య ఉద్యోగుల సేవలు అభినందనీయం

- ఘనంగా మెడికల్ ఎంప్లాయిస్ ఆవిర్భావ దినం

అమలాపురం టౌన్: కోవిడ్ సమయంలో వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు రోగులకు అందించిన సేవలు అభినందనీయమని ఆ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు, ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు అన్నారు. ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో మంగళవారం జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్తిబాబు కోవిడ్‌లో ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది ప్రాణాలను ఫణంగా పెట్టి అందించిన సేవలను కొనియాడారు. తొలుత జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆస్పత్రి ప్రాంగణంలో యూనియన్ జెండాను సత్తిబాబు ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి వసంత అధ్యక్షతన జరిగిన సభలో మెడికల్ ఆఫీసర్ తిరుమల, అమలాపురం డివిజన్ యూనియన్ అధ్యక్షురాలు శార్వాణి పాల్గొని ప్రసంగించారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సత్యవతి ఆవిర్భావ దినోత్సవ కేక్‌ను కట్ చేశారు. రేడియాలజీ విభాగం ఉద్యోగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి ప్రాంగణంలో యూనియన్ జెండా ఆవిష్కరిస్తున్న సత్తిబాబు

మూడు గంటలకే మూత..!

ఉప్పలగుప్తం: మండలంలోని వానపల్లిపాలెం గ్రామం మెయిన్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రం మంగళవారం మూడు గంటలకే మూత పడింది. శిశు సంక్షేమ శాఖ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కేంద్రాలు విధిగా పని చేయాల్సి ఉంటుంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలందించాల్సిన అంగన్వాడీ కార్యకర్తలు సమయం ముగియకుండానే ఇంటి బాట పడుతున్నారని స్థానికంగా సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. దీనిపై ఐసీడీఎస్ ఉప్పలగుప్తం సెక్టార్ సూపర్‌వైజర్ కె.లీలాకుమారిని వివరణ కోరగా ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపడతామని బదులిచ్చారు.



వానపల్లిపాలెంలో మూడు గంటలకే మూత పడిన అంగన్వాడీ భవనం

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

- సర్వాంగ సుందరంగా ముస్తాబైన చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవ సోదరులు
- నేడు క్రిస్మస్ పర్వదినం

తాళ్లరేవు: క్రైస్తవుల పవిత్ర పండగ క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకునేందుకు చర్చిలు ముస్తాబయ్యాయి. వేడుకలను పురస్కరించుకొని పలు ప్రాంతాల్లోని చర్చిలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దీంతో విద్యుద్దీపాలంకరణతో కాంతులీనుతున్నాయి. క్రైస్తవ సోదరుల ఇళ్లవద్ద క్రిస్మస్ సందడి నెలకొంది. తమ ఇళ్ల వద్ద స్టార్, క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం నుంచే చర్చిలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా తాళ్లరేవులోని బాప్టిస్టు చర్చి, కోరంగి, సీతారామపురం, పి.మల్లవరం, చొల్లంగి, జార్జిపేట, నీలపల్లి, ఇంజరం తదితర గ్రామాలలోని చర్చిలలో క్రిస్మస్ వేడుకలు మొదలయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. సుంకరపాలెం శ్రీ చైతన్య పాఠశాలలో క్రిస్మస్ సంబరాలను ఘనంగా నిర్వహించారు.

అమలాపురం టౌన్: కిస్మస్ వేడుకల నిర్వహణలో క్రైస్తవ సోదరులు నిమగ్నమయ్యారు. తమ ఇళ్ల వద్ద స్టార్‌లు, క్రిస్మస్ ట్రీలకు విద్యుత్ దీపాలాంకరణలతో ముస్తాబు చేసుకున్నారు. పాస్టర్లు, ఫాదర్లు చర్చిలను విద్యుత్ కాంతులీనేలా శోభాయమానంగా తీర్చిదిద్దారు. జిల్లా కేంద్రం అమలాపురంలోని ప్రధాన చర్చిలైన మన్నా సిల్వర్ జూబ్లీ చర్చ్, సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలు ఆకర్షణీయమైన సెట్టింగులతో విద్యుత్ దీపాలతో అలంకృతమయ్యాయి. మన్నా చర్చిలో ప్రధాన కాపరి కార్ల్ డేవిడ్ కొమానపల్లి (లాల్), సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ కేకే పాల్ క్రిస్మస్ ప్రార్థనలు చేస్తూ సందేశాలు ఇస్తున్నారు. ఇవి కాకుండా అమల్పోవి మాత చర్చ్, చర్చ్ ఆఫ్ క్రీస్తుతో పాటు పట్టణంలోని చిన్నా పెద్ద కలిపి దాదాపు 35 చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. మన్నా చర్చిలో డిజిటల్ క్రిస్మస్ సెట్టింగ్ క్రైస్తవులను ఆకట్టుకుంటోంది. ఈ చర్చ్ ప్రాంగణంలో కిస్మస్ ట్రీలను పోలిన ఎత్తయిన విద్యుత్ దీపాలతో నెలకొల్పిన సెట్టింగ్‌లు చూపరులను అలరిస్తున్నాయి.



అమలాపురంలో విద్యుత్ దీపాల వెలుగులో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న మన్నా చర్చి

ఐ.పోలవరం: క్రీస్తు జననాన్ని పురస్కరించుకొని క్రైస్తవులు పలు రకాలుగా క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తారు. డిశెంబర్ ఒకటో తేది నుంచే క్రిస్మస్ వేడుకలు ప్రారంభమవుతాయి. ఉమెన్, యూత్, చిల్డన్, గ్రాండ్ క్రిస్మస్ పేరిట క్రిస్మస్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వితంతువులు, పేదలకు వస్త్రాల పంపిణీ, పేదలకు అన్న సమారాధన తదితర కార్యక్రమాలతో పాటు కొవ్వొత్తులతో రాత్రి సమయాల్లో ప్రదర్శన, ప్రత్యేక ప్రార్థనలు, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. 25న క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిల్లో ఆధ్మాత్మిక వాతావరణం నెలకొంటుంది. మండలంలోని కొమరగిరి, టి.కొత్తపల్లి, కేశనకుర్రు తదితర గ్రామాల్లోని చర్చిల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



కొమరగిరిలో క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయిన చర్చి

ముమ్మిడివరం: స్థానిక ఆర్‌సీఎం చర్చి, మున్నా చర్చి, పశువుల్లంకలోని ఆర్‌సీఎం చర్చి, టి.కొత్తపల్లిలోని సెయింట్ పాల్ చర్చి, కాట్రేనికోన ఎబినేజర్ మందిరం, తాళ్లరేవు ఒసన్నా ప్రార్థనా మందిరం, జాబ్లి చర్చిలతో పాలు ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించి వేడుకలకు సిద్ధం చేశారు. దేశంలోని అతి పెద్దదైన ఏసుక్రీస్తు విగ్రహాన్ని యానాం రాజీవ్ బీచ్‌లో ఏర్పాటు చేశారు. ఇక్కడ క్రిస్మస్ వేడుకలకు పుదుచ్చేరి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. క్రిస్మస్ సందర్భంగా నియోజకవర్గంలోని వ్యాపార కేంద్రాలలో స్వీట్స్ దుకాణాలు, బేకరీల్లో సందడి నెలకొంది.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు

యానాం: నియోజకవర్గ పరిధిలో క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. కరుణామయుని జనన వేడుకలకు వివిధ చర్చిలు విద్యుత్ వెలుగుల కాంతులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. ప్రఖ్యాత చారిత్రక ఫ్రెంచికాలం నాటి రోమన్ కేథలిక్ చర్చిని అందంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా పశువులశాలలో బాలయేసు జననం సెట్‌ను అందంగా తీర్చిదిద్దారు. ఫాదర్ మరియదాసు క్రిస్మస్ సందేశాన్ని అందించగా యానాం పరిసర ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గౌతమీ గోదావరి రాజీవ్‌బీచ్ వద్దనున్న జీసెస్ స్టాట్యూను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మెట్టకూరులో బాప్టిస్టు చర్చి, అంబేద్కర్‌నగర్‌లో చర్చి, కురసంపేటలో రివైవల్ చర్చి, పెంతికోస్టల్ చర్చి, పరంపేట, దరియాలతిప్ప, మెట్టకూరు, బాలయోగి కాలనీ తదితర ప్రాంతాల్లో చర్చిలను క్రిస్మస్ సంబరాలకు అందంగా ముస్తాబు చేశారు.



రాజీవ్ బీచ్‌లో విద్యుత్ వెలుగుల్లో చర్చి



గౌతమీ గోదావరి వద్ద జీసెస్ స్టాట్యూ

అధ్యాపక పోస్టు భర్తీకి ఇంటర్వ్యూలు

యానాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంగ్లీషు అధ్యాపకుడి పోస్టు భర్తీకి(షార్ట్‌టెర్మ్ కాంట్రాక్టు) జనవరి 3న వాక్‌ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటల నుంచి కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఎంఏ(ఇంగ్లీషు) ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించినవారై ఉండాలన్నారు. టీచింగ్‌లో అనుభవం ఉన్న వారికి అదనపు మార్కులు ఉంటాయన్నారు. అర్హులైన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు